క్లుప్తంగా

రోజుకు రూ.257 వేతనం



చిన్నశిర్లాంలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులకు రోజుకు రూ.257 వేతనం లభిస్తుందని ఏపీఓ ఎస్.హరనాథరావు తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నశిర్లాం, బాలకవివలస గ్రామ చెరువుల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వేతనదారుల మస్టర్లపై ఆరాతీశారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీఏ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనుల నిర్వహణలో జాప్యంపై జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ వేమలి స్వామినాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. అక్కడి పనుల నిమిత్తం వచ్చిన సిమెంట్‌ను సకాలంలో వినియోగించకపోవడంతో పాటు వాటిని సరిగ్గా భద్రపరచకపోవడంతో సిమ్మెంట్ బస్తాలు పాడైనట్లు గుర్తించారు. ఈ నిర్వాకానికి కారణమైన ఎస్ఎస్ఏ జేఈ వై.దాలయ్య, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింహాచలానికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వీరితో పాటు పాఠశాల హెచ్ఎంకు కూడా షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు వెల్లడించారు.

మహిళలకు అండగా ప్రభుత్వం



భోగి పండగ కిట్‌లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, తహసీల్దార్ ఐజాక్

వంగర: మహిళలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ క్రాంతి పథం, డీఆర్‌డీఏలు సంయుక్తంగా మహిళా సంఘాలతో తయారు చేయించిన భోగి పండగ కిట్‌లను బుధవారం ఆవిష్కరించారు. వీటిని రాజాంలో ఏర్పాటు చేయనున్న స్టాల్స్‌లో విక్రయిస్తారని, ఇది మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.భగవతి, ఏఓ ఎల్.త్రినాథ్, ఏపీఎం బి. గోవిందరావు, సీసీలు, వీఓఏలు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బాధితురాలికి వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ

రేగిడి: మండలంలోని ఏవీపురంలో దార రాము ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆయన భార్య ధనలక్ష్మికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.10 వేల తక్షణ సాయం ఎంపీపీ దార అప్పలనరసమ్మ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలు



మద్దువలస సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ త్రినాధులు

వంగర: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల పరిషత్ ఏఓ లోపింటి త్రినాధులు సూచించారు. బుధవారం మండలంలోని మద్దువలస, మగ్గూరు సచివాలయాలను సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు నిర్వహణ, ఉద్యోగుల హాజరు, ప్రజా ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయానికి హాజరై, ప్రజల సమస్యల పరిష్కరించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

రామభద్రపురం: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, అంగన్‌వాడీ వర్కర్లలో ఉన్న పేదలకు ఇంటి స్థలాలు ఇప్పించాలని తహసీల్దార్ పి.గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బలస శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.సత్యవతి,

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



భోగి మంట చుట్టూ తిరుగుతూ కోలాటం ఆడుతున్న విద్యార్థులు



తెర్లాం: వెలగవలస హైస్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు



రాజాం : పెనుబాక పాఠశాలలో సంక్రాంతి వేడుకలు



బాడంగి హైస్కూల్‌లో భోగి మంటలు వేసి వేడుకలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సంతకవిటి: బొద్దూరు పాఠశాలలో భోగి మంటలు వేసి డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

తెర్లాం: మండలంలోని వెలగవలస హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు చూపరులను ఆకట్టుకున్నాయి. హైస్కూల్ హెచ్ఎం ఆర్.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు ప్రదర్శించిన భోగి మంటలు, హరిదాసు వేషధారణ, రంగురంగుల ముగ్గులు ఉపాధ్యాయులను, విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థినులు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. విజేతలకు హెచ్ఎం పాపారావు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి సీహెచ్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయినిలు శ్రీదేవి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రాజాం సిటీ: పట్టణంతో పాటు మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బుచ్చెంపేట, బొద్దాం ఎంపీపీ పాఠశాల్లో భోగి మంటలు వేయడంతో పాటు సంక్రాంతి ముగ్గులు వేసి ఆటపాటలతో విద్యార్థులు సరదాగా గడిపారు. అనంతరం సంక్రాంతి విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

సంక్రాంతి సంబరాలు

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాయివాగ్దేవి పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు బుధవారం నిర్వహించారు. భోగి మంటలు వేశారు. రంగవల్లుల పోటీలతో, గొబ్బెమ్మలను అలంకరించి వేడుకలు జరిపారు. హెచ్ఎం త్రినాధరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



కుమ్మరిపేటలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని నిరుపేద వృద్ధులకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, కుమ్మరిపేట, ఆమిటి గ్రామాల్లోని వృద్ధులకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రనిధులు, అధికారుల చేతుల మీదుగా దుస్తుల పంపిణీ చేశారు. ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా తమ సంస్థ ద్వారా నిరుపేదలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని చేస్తున్నామని, ఈ ఏడాది కూడా నిరుపేదలను గుర్తించి వారికి దుస్తులు పంపిణీ చేస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ అగ్రహారం సర్పంచ్ ఎల్.లక్ష్మి, ఉప సర్పంచ్ భాస్కరరావు, వీఆర్‌ఓ సువ్వాడ నరసింహనాయుడు, పంచాయతీ కార్యదర్శులు హైమావతి, వి.హరి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

రాజాం సిటీ: మండలంలోని పలు గ్రామాల్లోని నిరుపేదలకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. నందబలగ, లక్ష్మీపురం, అంతకాపల్లి, బొద్దాం, గడిముడిదాం, కంచరాం, బుచ్చెంపేట గ్రామాల్లోని పేదలకు జీఎంఆర్ వీఎఫ్ ప్రతినిధుల చేతులమీదుగా దుస్తులు అందజేశారు. సంక్రాంతి పురస్కరించుకుని, పారిశ్రామికవేత్త గ్రంధి మల్లిఖార్జునరావు వేలాది మంది పేదలకు దుస్తులు వితరణ చేస్తుండగా, గత రెండేళ్ల నుంచి కోవిడ్ కారణంగా గ్రామాల్లోనే దుస్తుల పంపిణీ చేపడుతున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో తాడ్డి గోపాలకృష్ణ, గేదెల సత్యం, టంకాల సూరపునాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూడారై పూజలు



శ్రీవైభవ వేంకటేశ్వరాలయంలో కూడారై పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, నిర్వాహకులు

బొబ్బిలి: పట్టణంలో పూల్‌బాగ్ సింగారపువీధిలో శ్రీవైభవ వేంకటేశ్వరాలయంలో బుధవారం కూడారై పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి, ప్రసాదాన్ని సిద్ధం చేసి పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, వైద్యులు కేవీ అప్పారావు, శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

బ్యాంకు గ్యారంటీలు ఏవీ!

- తగిన సమయానికి ధాన్యం పంపాల్సిందే..
- ఎస్‌డీసీ సూర్యనారాయణ

మెంటాడ: ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లులు బ్యాంకు గ్యారంటీలను ఇంతవరకూ సబ్‌మిట్ చేయకపోవడ మేంటంటూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఇప్పలవలస, జయితి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రక్ షీట్లు జనరేట్ చేసిన నాలుగు రోజులు వరకూ ధాన్యం మిల్లులకు పంపకపోవడంపై సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోలులో వారికి పూర్తి స్థాయి సహకారం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికి 70 శాతానికి మించి అంటే సుమారు 12వేల మెట్రిక్ టన్నులు ధాన్యం అమ్మగలిగామని తెలిపారు. ప్రతీ ఆర్బీకేకు సివిల్ సప్లై శాఖ ధాన్యాన్ని అమ్మే అవకాశం ఇస్తే ధాన్యాన్ని పంపే అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట సీఎస్ డీటీ ధనం తదితరులు ఉన్నారు.

845 సంఘాల రికార్డుల ఆడిట్ పూర్తి



ఆడిట్‌పై సమీక్షిస్తున్న వెలుగు ఏసీ చిరంజీవి

రాజాం: క్లస్టర్ పరిధిలో స్వయం సహాయక సంఘాల రికార్డుల ఆడిట్ చురుగ్గా జరుగుతోంది. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సిబ్బందితో వైకేపీ ఏసీ ఎ.చిరంజీవి సమావేశమై ఆడిట్‌పై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల రికార్డుల్లో నిధుల దుర్వినియోగం, అవకతవకల దృష్ట్యా ఆడిట్ చేసి, నిధుల లెక్క తేల్చుటకు ఈ కార్యక్రమం జరుగుతోందని వెల్లడించారు. క్లస్టర్ పరిధిలో మొత్తం 7,360 సంఘాలు ఉండగా, వీటిలో 845 సంఘాల రికార్డుల ఆడిట్ పూర్తయిందన్నారు. మొత్తం 13 సీఆర్పీ టీమ్‌లు ఈ ఆడిట్ చేస్తున్నాయని, ఒక్కో టీమ్‌లో ముగ్గురు సీఆర్పీలు ఉన్నారన్నారు. ఈ ఆడిట్ వల్ల సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత, నిధుల నిర్వహణపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆర్థిక అంశాలపై పారదర్శకత కల్పించుట, సంఘం యొక్క జమా ఖర్చులు, ఆదాయ, వ్యయాలు, ఆస్తి, అప్పులు పట్టిక తయారీకి కూడా ఈ ఆడిట్ ఉపయోగపడుతుందన్నారు.

నేడు స్టాల్ ఏర్పాటు..

రాజాం పట్టణంలోని ప్రధాన రహదారిపై రైతు ఉత్పత్తి సంఘాలు తయారు చేసిన భోగి పిడకల దండలు, నువ్వుల నూనె, నలుగుపిండితో కూడిన వస్తు సామగ్రి విక్రయాల స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు వైకేపీ ఏసీ ఎ.చిరంజీవి తెలిపారు. గురువారం నుంచి రెండు రోజులు పాటు ఈ స్టాల్ ఉంటుందని, కేవలం రూ.70కే మొత్తం భోగి పండగ సామగ్రి కిట్ లభిస్తుందన్నారు. పట్టణ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంలు టి.దధికుమార్, కె.హేమలత, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధంకండి

మెంటాడ: మార్చి 22వ తేదీ నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని మండల ప్రత్యేకాదికారి డి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కన్వర్జెన్ష్ సమావేశంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెలాఖరు నాటికి ఇంటి నిర్మాణం ప్రారంభం చేయని వారి పట్టాను రద్దు చేస్తామని నోటీసులు లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. గడప గడపకు పనులు నత్తనడకన సాగుతున్నాయని వాటిని వేగవంతం చేయాలన్నారు. సచివాలయంలో ఈ సర్వీసులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, ఎంపీడీఓ తివిక్రమ్, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావుతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పుర్లి గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి, నిమోనియా వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాలవలస సూర్యారావు, షర్మిల, యోగా ఇన్‌స్ట్రక్టర్లు రామకృష్ణ, శైలజ, ఏఎన్ఎం రాంబాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



విష్ణుమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: మండలంలోని పెద్దశిర్లాం గ్రామానికి చెందిన సంచాన విష్ణుమూర్తి ఇటీవల మృతి చెందగా, ఆయన భార్య అప్పలనారాయణను ఎమ్మెల్సీ పాలవలస విక్రాత్ బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన విష్ణుమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన కోట్ల సత్యంనాయుడు కూడా ఇటీవల చనిపోగా, ఆయన భార్య కన్నమ్మతో పాటు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంక్షిప్తంగా...

ఎమ్మెల్యే పరామర్శ



సూరపునాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: పట్టణానికి చెందిన శ్రీకాకుళం జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ దూబ సూరపునాయుడును ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం పరామర్శించారు. ఇటీవల సూరపునాయుడు గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆయనను కలిసి పరామర్శించి, పూర్తి స్థాయి ఆరోగ్యం సాధించాలని ఆకాంక్షించారు.

గిరిజనులకు చేయూత

బొబ్బిలి రూరల్: కృపావలస, దీవెనవలస, రాజయ్యవలస తదితర గిరిజన గ్రామాలలో మదర్ థెరీసా క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి కానుకలుగా బియ్యం, దుస్తులు,ని త్యావసరాలు బుధవారం పంపిణీ చేశారు. పేదలకు చేయూతనందించడం ఆనందదాయకమని అంబేడ్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సోరుసాంబయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చోడిగంజి రమేష్‌నాయుడు అన్నారు.

రైతుభరోసా కేంద్రం తనిఖీ

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి రైతుభరోసా కేంద్రాన్ని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్ బుధవారం పరిశీలించారు. రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు, రైతులకు అందుతున్న సేవలను పరిశీలించిన ఆయన రికార్డులు పరిశీలించారు. పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు వివరించి, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక రైతుల నుంచి సమాచారం సేకరించారు.

17 మద్యంబాటిళ్ల స్వాధీనం

వంగర: మండలంలోని కింజంగి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన నుంచి 17 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు.

శరవేగంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతోంది. మొత్తం 257 ఇళ్ల నిర్మాణాలు ఒకేచోట నిర్మిస్తుండడంతో అదొక గ్రామంలా తలపిస్తోంది. నిర్మాణాలపై ఎప్పటికప్పుడు అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో నిర్మాణాలకు ముందుకు వచ్చిన లబ్ధిదారులు తమ ఇళ్లను చకచకా పూర్తి చేసేస్తున్నారు.

ఎంఈఓకు సన్మానం

వంగర: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ వై.దుర్గారావును వివిధ పాఠశాలల హెచ్ఎంలు బుధవారం సన్మానించారు. చిట్టిగురువులు కార్యక్రమం సంబంధించి, జిల్లా స్థాయి అవార్డు పొందిన నేపథ్యంలో ఎంఈఓను సత్కరించినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎం.తేజోవతి, జగన్ మోహనరావు, శ్రీకర్ పాల్గొన్నారు.

అన్నదానం

బొబ్బిలి: సంక్రాంతి సందర్భంగా పట్టణంలో ఇందిరమ్మ కాలనీలో బుధవారం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో 100మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదలందరికీ ఆహారం అందించడం ఆనందదాయకమని రియాజ్‌ఖాన్ అన్నారు. కార్యక్రమంలో మదర్‌థెరీసా ట్రస్ట్ అధ్యక్షుడు కూపర్‌కిలెఫ్, వైస్ ఎంపీపీ ఎ.శంకరరావు, విశ్రాంత తహసీల్దార్ విజయకుమార్, బబ్లు, ఉదయ్‌కిరణ్, సైమన్ పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

బాడంగి: మండలంలోని కోడూరు 1 సచివాలయాన్ని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి బుధవారం సందర్శించారు. వైఎస్సార్ కల్యాణమస్తుకు దరఖాస్తు రావడంతో వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది పనితీరు, హాజరుపై ఆరా తీశారు. సచివాలయ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామ ఆర్బీకేలో అగ్నిఅస్త్రం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. సీఆర్పీ నారాయణమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెరపురుగు నివారణకు అగ్నిఅస్త్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు ప్రకృతిలో లభ్యమయ్యే వనరులు ఉపయోగించి, దీనిని తయారుచేసుకుని వాడవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో ఆశించిన దిగుబడి సాధించేందుకు వీలుంటుందన్నారు.

ముగిసిన పెదపోలమ్మ సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి పెదపోలమ్మ సంబరాలు బుధవారం ముగిశాయి. అమ్మవారి అనుపోత్సవం బుధవారం నిర్వహించగా, పెదపోలమ్మ ఆలయం వద్ద బారులుతీరి జనం మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ ముగియడంతో గ్రామానికి వచ్చిన వారు తిరుగు పయనం కావడంతో వాహనాల రద్దీ విపరీతమైంది. ముగింపు ఉత్సవాలు ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. పలువురు అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ముగింపు ఉత్సవాలలో పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

రేగిడి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డు సర్వేను వేగవంతం చేయండి అని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు సూచించారు. మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశమైన ఆయన ఈ కార్డు ద్వారా లబ్ధిదారులు ఆరోగ్య బీమా పొందవచ్చన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

రాజాం సిటీ: మండల పరిధిలోని వీఆర్‌అగ్రహారం గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. కాలువల్లో తీసిన మురుగును ఆరుబయటకు తరలించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, క్లాప్ మిత్రలకు చెత్త వేరుచేసే విధానంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ డి.వెంకటరమణ పాల్గొన్నారు.

పొలంబడి పరిశీలన

బాడంగి: మండలంలోని వీరసాగరం గ్రామంలో వైఎస్సార్ పొలంబడి ద్వారా చేపట్టిన రబీ వరి సాగు విధానాన్ని ఏఓ కె.శిరీష బుధవారం పరిశీలించారు. వరినాట్లు వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రబీ ఈ క్రాప్ బుకింగ్ ప్రారంభమైనందున రబీ పంటల సాగు రైతులంతా నమోదు చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ లబ్ధి కోసం రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. పరిశీలనలో వీఏఏ సతీష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

చల్లపేటలో డీసీసీబీ శాఖ కార్యాలయం

మెంటాడ: మండలంలోని చల్లపేట గ్రామానికి డీసీసీబీ శాఖ కార్యాలయం మంజూరైందని పీఏసీఎస్ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కృషితో ఈ బ్యాంకు శాఖ మంజూరైందని, త్వరలోనే నిర్మాణానికి నోచుకుంటుందన్నారు.

సజావుగా సాగిన సామాజిక తనిఖీ



ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తెర్లాం: మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన 2020 – 21, 2021 – 22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం సజావుగా జరిగింది. ప్రజావేదికకు ఉపాధి హామీ పథకం ప్రొసీడింగ్ అధికారి శారదాదేవి, ఆ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి ఎస్.రవీంద్ర, రాజాం క్లస్టర్ ఏపీడీ రాధ హాజరయ్యారు. ఎంపీడీఓ, ఉపాధి పీఓ శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పనుల వివరాలు, నిధుల ఖర్చు, సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలను చర్చించారు. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పలు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, చెరువు గట్లపైనా నాటిన మొక్కలు చనిపోయినట్లు సామాజిక తనిఖీలో తనిఖీ బృందం గుర్తించారని, వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు తెలియజేశారు. కొన్ని గ్రామాల్లో మస్టర్ల దిద్దుబాటు, పనులు చేసి, నిధులు వెచ్చించిన వాటికి టెక్నికల్ అసిస్టెంట్లు ఎం.బుక్‌లు రికార్డింగ్ చేయకపోవడం, పనుల కొలతల్లో వ్యత్యాసాలు ఉండడంపై సంబంధిత క్షేత్ర, సాంకేతిక సహాయకులను ప్రశ్నించారు. వాటికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జరిగిన చిన్నచిన్న లోపాలను గుర్తించి వాటికి సంబంధించిన క్షేత్ర, సాంకేతిక సహాయకులకు నిధుల రికవరీ కట్టాలని, లేదా వాటికి సంబంధించిన ఆధారాలు చూపించాలని రాశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ కె.వెంకయ్య, ఉపాధి మండల ఏపీఓ జగదీశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, వేతనదారులు పాల్గొన్నారు.

డీఎల్‌ఆర్ తయారీలో నిర్లక్ష్యం వద్దు



డీఎల్‌ఆర్ తయారీని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం ద్వారా గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయిన తరువాత చేపట్టే డీఎల్‌ఆర్(డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డ్స్) తయారు చేయడంలో సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు నిర్లక్ష్యం వహించవద్దని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో మండలంలోని కొల్లివలస, చినపాలవలస గ్రామాల డీఎల్‌ఆర్ తయారీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేలో కీలకమైనది డీఎల్‌ఆర్ తయారు చేయడమేనన్నారు. డీఎల్‌ఆర్ తయారు చేసేటప్పుడు రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. రైతులకు సంబంధించిన పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం ఆన్‌లైన్‌లో నమోదు చేసే ముందు ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని వివరాలు నమోదు చేయాలని కోరారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

రామభద్రపురం: స్థానిక జాతీయ రహదారిలో పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి సీఐ తిరుమలరావు ముమ్మరంగా వాహన తనిఖీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరగకుండా అరికట్టడమే లక్ష్యమన్నారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. రామభద్రపురం మండల కేంద్రం అంతర రాష్ట్ర కూడలి కావడంతో బోర్డర్‌లో ఉన్న ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి మద్యం, గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మారక ద్రవ్యాలు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రదాన కూడళ్ల వద్ద తనిఖీలు చేపడుతున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదన్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు



అలజంగిలో మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు రైతులు కృషి చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్ సూచించారు. మండలంలో అలజంగిలో మొక్కజొన్న పంటను బుధవారం పరిశీలించిన ఆయన పంటకు కత్తెరపురుగు పట్టడం గుర్తించారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెకిన్ బెంజోయేట్ 100గ్రాములు, 500ఎంఎల్ వేపనూనెకు కలిపి ఎకరాకు 12ట్యాంకులు పిచికారీ చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో రైతులు పంటలో నీరు చేరకుండా చూడాలని, అదేవిధంగా రెండో విడత ఎరువు కింద ఒకఎకరాకు 50కేజీల యూరియా, 25కేజీల మ్యూరేట్ ఆఫ్ పటాస్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు పైలవేణు, వ్యవసాయ సహాయకురాలు పెంట లత పాల్గొన్నారు.